# అభివృద్ధే మంత్రం.. గెలుపే లక్ష్యం...

- క్షేత్ర స్థాయిలో దూసుకుపోతున్న బీఆర్ఎస్ శ్రేణులు
- రెండు నెలలుగా అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలతో మమేకమైన అభ్యర్థులు
- కోడ్ రాకతో అభివృద్ధిని పాశుపతాస్త్రంగా మరో విడత ప్రజల్లోకి..
- కండ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలంటూ ప్రచారం
- రోజురోజుకు బీఆర్ఎస్ అభ్యర్థులకు పెరుగుతున్న మద్దతు, ఏకగ్రీవ్ర తీర్మానాలు
- 'కారు' స్పీడ్‌కు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నిర్వేదం




స్టీల్ బ్రిడ్జ్ – ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ (ఫైల్)

సిటీబ్యూరో, అక్టోబర్ 10(నమస్తే తెలంగాణ): ఎన్నికల సమరంలో 'కారు' స్పీడ్‌ను పెంచింది. గడిచిన రెండు నెలలుగా అభివృద్ధి, సంక్షేమ పథకాలతో నియోజకవర్గాన్ని చుట్టేసిన అభ్యర్థులు జనంతో మమేకమయ్యారు. ఈ నేపథ్యంలోనే రెండు రోజుల క్రితం ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు అందించిన అభివృద్ధిని పాశుపతాస్త్రంగా మార్చుకొని ప్రతిపక్షాలపై విజయం సాధిస్తామన్న ధీమాతో బీఆర్ఎస్ అభ్యర్థులు రెండో విడత ప్రచారానికి శ్రీకారం చుట్టారు. తొమ్మిదిన్నరేండ్ల నియోజకవర్గ ప్రగతిని కరపత్రంగా ముద్రించి కండ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలంటూ ప్రజల్లోకి వెళుతున్నారు. ఈ ఇచ్చిన హామీలను నెరవేర్చిన మా విశ్వసనీయతనే ఈ ఎన్నికల్లో తమ విజయమంత్రంగా మారుతుందని బీఆర్ఎస్ నేతలు ఈ సందర్భంగా చెబుతున్నారు. తెలంగాణ అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకున్న ప్రజా వ్యతిరేక శక్తులకు, తెలంగాణ వ్యతిరేక శక్తులకు ఎన్నికల్లో మరొకసారి ఓటమి తప్పదని, ప్రజల మద్దతుతో గులాబీ జెండాను మరోసారి ఎగరేస్తామని బీఆర్ఎస్ అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రచారంలో ప్రతిపక్షాలకు అందనంత దూరంలో బీఆర్ఎస్ ఉంటే, టిక్కెట్ ఎంపికలో తడబాటు పడుతున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీ శ్రేణుల్లో నిర్వేదం నెలకొంది.

**చేరికలు.. ఏకగ్రీవ తీర్మానాలతో సందడి**

ప్రచార పర్వాన్ని ముమ్మరం చేస్తూనే మరో పక్క కలిసి వచ్చే నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తూ గులాబీ కండువా కప్పుతున్నారు. నియోజకవర్గంలో కీలక నేతలు మొదలు ద్వితీయ శ్రేణి నాయకుల వరకు గులాబీ పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయా నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులకు అన్ని వర్గాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తున్నది. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా ఉంటామని, పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలుపించుకుంటామని ప్రతిజ్ఞ చేస్తున్నారు. కాలనీలు, బస్తీల్లో అభ్యర్థులకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నారు. గ్రేటర్‌లోని టీఆర్ఎస్ పార్టీకి లభిస్తున్న ప్రజాదరణను బట్టి మెజార్టీ నియోజకవర్గాలలో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



28డివిజన్ కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి, మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్

## మా మద్దతు.. మంత్రి మల్లారెడ్డికే...

**జవహర్‌నగర్ డివిజన్‌కు చెందిన కాలనీల అధ్యక్షులు, సభ్యులు**

జవహర్‌నగర్, అక్టోబర్ 10: మా మద్దతు మంత్రి మల్లారెడ్డికే అంటూ జవహర్‌నగర్ 28వ డివిజన్‌కు చెందిన అన్ని కాలనీల కమిటీ అధ్యక్షులు, మెంబర్లు భారీ సంఖ్యలో మంత్రి మల్లారెడ్డిని కలిశారు. మంగళవారం బోయిన్‌పల్లిలోని మంత్రి మల్లారెడ్డి క్యాంపు కార్యాలయంలో మేయర్ మేకల కావ్య ఆధ్వర్యంలో 'మేమంతా మంత్రి మల్లారెడ్డి వెంటే..' ఉంటామని మంత్రి మల్లారెడ్డిని జవహర్‌నగర్ డివిజన్ వాసులు కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ జవహర్‌నగర్ నా గుండెకాయ లాంటిదని, అత్యధిక నిధులు కేటాయించి కార్పొరేషన్‌ను మోడల్ సిటీగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి తిరుగులేదని, మంత్రి మల్లారెడ్డి చేసిన అభివృద్ధే గెలిపిస్తున్నదని స్థానికులు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు జిట్టా శ్రీవాణి శ్రీనివాస్ రెడ్డి, లావణ్య సతీష్ గౌడ్, నాగరాణి, లక్ష్మి, కో ఆప్షన్ సభ్యులు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్ రెడ్డి, జిల్లా నాయకుడు మేకల అయ్యప్ప, పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, నాయకులు రాజశేఖర్, ప్రశాష్, మహేశ్, రమేష్‌చారి, బండకింది ప్రసాద్, సుధాకర్‌చారి, ప్రణీత్, మతిన్, 28వ డివిజన్ అధ్యక్షుడు బూడిద వెంకటేష్, మహిళలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్లారెడ్డికే మా మద్దతు..

***బోడుప్పల్ యాదవ్ సంఘం ప్రతినిధుల ప్రకటన***



బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చామకూర మల్లారెడ్డికి మద్దతు తెల్పుతున్న యాదవ సంఘం ప్రతినిధులు

బోడుప్పల్, అక్టోబర్ 10: బంగారు తెలంగాణ సాధనలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి చామకూర మల్లారెడ్డికి బోడుప్పల్ యాదవ సంఘం అధ్యక్షుడు జనిగ బంగారు యాదవ్ సంపూర్ణ మద్దతు తెలిపారు. బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో యాదవ సంఘం ప్రతినిధులు మంత్రి మల్లారెడ్డిని మంగళవారం కలిసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ... ఎంపీగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులుగా కృషి చేశానని, సీఎం కేసీఆర్ సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న నేపథ్యంలో కులాల వారీగా మద్దతు తెలుపడం సంతోషంగా ఉందన్నారు. యాదవుల కోరిక మేరకు కొండ పోచమ్మ ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయాన్ని అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, యాదవ సంఘం ప్రతినిధులు మల్లేశ్ యాదవ్, గుర్రాల వెంకటేశ్ యాదవ్, చక్రపాణి గౌడ్, జయరాములు, శ్రీరాములు, బాలయ్య యాదవ్, శ్రీశైలం యాదవ్, రమేశ్ యాదవ్, లక్ష్మయ్య యాదవ్, సత్యనారాయణ యాదవ్, సత్యమూర్తి యాదవ్, శ్రీనివాస యాదవ్, భాస్కర్ యాదవ్, హరి, సుధాకర్ పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిని ఉల్లంఘించకుండా సహకరించాలి

***పలు పార్టీల నాయకులతో మేడ్చల్ జిల్లా కలెక్టర్***



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్

మేడ్చల్, అక్టోబర్ 10(నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించకుండా రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ నాయకులతో ఎన్నికల నియమావళి తదితర అంశాలపై సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరు ఎన్నికల నియామవళి ప్రకారం వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందం ఎల్లప్పుడు పర్యటిస్తుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని రాజకీయ పార్టీలు నడుచుకోవాలన్నారు. రాజకీయ పార్టీల వారు తమ పార్టీల బూత్ లెవల్ ఏజంట్లను నియమించుకోవాల్సిందిగా కలెక్టర్ అమోయ్ కుమార్ సూచించారు. ప్రశాంతమైన వాతావారణంలో జరిగేలా సహకరించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్వో హరిప్రియ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మీ వెంటే.. కార్మికలోకం...

- వివేకానంద్‌కు హమాలీ సంఘం సంపూర్ణ మద్దతు
- ఎమ్మెల్యేకు ఏకగ్రీవ తీర్మాన పత్రం అందించిన వందలాది మంది కార్మికులు



ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న హమాలీ యూనియన్ సంఘ ప్రతినిధులు, కార్మికులు

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 10: కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ వెంటే తామంతా నడుస్తామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం హమాలీ యూనియన్ సంఘం ప్రతినిధులు, కార్మికులు ప్రకటించారు. వివేకానంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేశారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడలో హమాలీ అడ్డా కూలీల కోసం హమాలీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని హమాలీ యూనియన్ సంఘం ప్రతినిధులు, కార్మికులు వందలాది మంది పేట్ బషీరాబాద్‌లోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి, సత్కరించారు. ఈ సందర్భంగా హమాలీ సంఘం నాయకులు మాట్లాడుతూ గతంలో ఏ నాయకుడు, ఏ ప్రభుత్వం తమను పట్టించుకోలేదని, హమాలీ అడ్డా కూలీల సమస్యలను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు విన్నవించగా.. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి పారిశ్రామిక వాడలో హమాలీ భవనం ఏర్పాటుకు స్థలం కేటాయించారని తెలిపారు. తమ సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించిన ఎమ్మెల్యే వివేకానంద్‌కు తామంతా రానున్న ఎన్నికల్లో మద్దతుగా నిలుస్తామని, అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ఏకగ్రీవ తీర్మానం చేసిన పత్రాన్ని వివేకానంద్‌కు అందజేశారు. కార్మికుల సమస్యల పరిష్కారినికి నిరంతరం కృషి చేస్తున్న వివేకానంద్ హ్యాట్రిక్ విజయం ఖాయమని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా ముందుకు సాగామని, రాబోయే రోజుల్లో మరిన్ని సదుపాయాల కల్పనకు నిరంతరాయంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంక్షేమ సంఘాల భవనాల నిర్మాణానికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేయూతనిస్తున్నదని, రాష్ట్ర ఏర్పాటుకు ముందు 50 ఏండ్లలో జరుగని అభివృద్ధిని బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందని, అభివృద్ధి ఫలాలను ఇప్పుడు మనం కండ్లారా చూస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో హమాలీ భవన్‌లో వంటశాల, భోజన శాల, విశ్రాంతి గదులు, సమావేశ హాలు, తదితర వసతులతో విశామైలన భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు మహమ్మద్ యూసూఫ్, సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల నాయకులు కీలుకాని లక్ష్మణ్, అంజయ్య, స్వామి, శ్రీనివాస్, శేఖర్, అశోక్‌రెడ్డి, దేవదానం, బీరప్ప, సునీల్, తిమ్మప్ప, అంజనేయులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీశ్




సిటీబ్యూరో, అక్టోబర్ 10(నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్ ఈవీఎం గోడౌన్స్‌ను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీశ్ పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల నెలవారి తనిఖీల్లో భాగంగా మంగళవారం గోడౌన్ సీల్‌ను తెరిచి పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదులను తనిఖీ చేశారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అనుకోని సందర్భాల్లో ప్రమాదాలు సంభవిస్తే తక్షణ చర్యలు చేపట్టేందుకు అవసరమైన అగ్నిమాపక సామగ్రి, ఇతర పరికాలను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సైదులు, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.